కథ

# దోషి


బి.పి.కరుణాకర్

ఆదివారం ఉదయం తొమ్మిదయి ఉంటుంది. వరండాలో కూర్చుని దినపత్రికను తిరగవేస్తున్నాను. చల్లటి ఎండ నేను కూర్చున్న మడతకుర్చీ వరకు వచ్చి ఆగింది. ఒక్క ఆదివారమే ఏపని చేయకుండా గడుపుతాను. అత్యవసరమయితే తప్ప ఎక్కడికీ వెళ్లను. నా భార్య కాని, పిల్లలు కాని ఫోన్లు తీసుకుంటారు. ఇంట్లో ఎవరూ నా విశ్రాంతికి భంగం కలిగించరు. నేను ఇంట్లో ఉన్నా లేననే చెబుతారు. ఎవరినీ చూడను.

ఆ ఉదయం మటుకు తప్పించుకోలేక పోయాను. నా బంగళా బయట కారు ఆగిన చప్పుడయింది. నేను కూర్చున్న చోట నుండి కారు నాకు కనిపిస్తోంది. ఆ కారును అక్కడినుండి తీసేయమని వాచ్‌మేన్ అరుస్తున్నాడు. కారు ముందుకు వెళ్లి దిగినట్టుంది. వెంటనే తలుపు మూసిన చప్పుడయింది.

కారు దిగింది ఆమే అనుకుంటాను. వాచ్‌మేన్ దగ్గరకు వచ్చి ఏదో అడుగుతోంది. వరండాకు గేటు అట్టే దూరంలో లేదు కాని మాటలు వినబడడం లేదు. ఆమెకు ముప్పయి అయిదు సంవత్సరాలుంటాయి. ఎర్రగా, సన్నగా ఉంది. వేసుకున్న సల్వార్ కుర్తా ఆమె వంటికి వదులుగా ఉన్నాయి. చదువుకున్న వ్యక్తిలా కనిపిస్తోంది. ఆమె నన్ను కలవాలని వాచ్‌మేన్‌ను అడుగుతోందనుకుంటాను. అతను ఒప్పుకోవడం లేదు. ఆ సమయంలో ఆమె రావడం నాకూ సమ్మతంగా లేదు. కాకపోతే ఆమెను ఎక్కడో చూశాను. పరిచయం ఉన్న వ్యక్తే. ఎక్కడ చూశాను గుర్తు రావడం లేదు. విజిటింగ్ కార్డు వాచ్‌మేన్ చేతిలో పెట్టి చేతులు జోడించి బతిమిలాడుతోంది. కన్నీళ్లు పెట్టుకుంటుందో, ఏమో నాకు కనిపించడం లేదు. చాలా మంది కన్నీళ్లల్లో నిజం ఏ మాత్రం ఉండదు. నటన నిజం కన్నా నిజంగా అనిపిస్తుంటుంది.

వాచ్‌మేన్‌కు ఆమె మాటలకు జాలి కలిగిందో, ఏమో ఆమె కార్డు చేత్తో పట్టుకుని నా దగ్గరకు వస్తోంటే లేచి



ఇంట్లోకి వెళ్ళి పోదామనిపించి లేవబోయే లోపల అతను నా దగ్గరకు వచ్చి భయ పడుతూనే తను తెచ్చిన కార్డు నా ముందుకు చూపారు. తీసుకున్నాను. అందులో జి.భారతి, ఎం.టెక్ అని ఉంది. చిరునామా ఉంది. ఉద్యోగ వివరాలు ఏమీ లేవు. ''నేడు ఎవరినీ చూడదల్చు కోలేదని చెప్పు'' అని కార్డు తిరిగి అతనికి ఇవ్వబోతూ తన పేరు కింద పెన్నుతో రాసింది. చూసి ఆగాను. డాటర్ ఆఫ్ జస్టిస్ జి.కృష్ణారావు అని ఉంది. కృష్ణారావు గారు నాకు గురువు. నన్ను పైకి తీసుకు వచ్చిన వ్యక్తి ఆయనే. హైకోర్టుకు చీఫ్ జస్టిస్ కావలసిన సమయంలో చనిపోయాడు. భారతి నాకు బాగా తెలుసు. కుర్చీలోంచి లేచే ప్రయత్నం విరమించుకుని, ''రమ్మను'' అన్నాను.

భారతి మెట్లు ఎక్కి వరండా మీదికొచ్చింది. ఆమెను పదేళ్ళ కిందట పెళ్ళిలో చూశాక మళ్ళీ ఇదే చూడడం. అప్పటికీ, ఇప్పటికీ పోల్చుకోలేనంతగా ఉంది. ఎముకల పోగులా ఉంది. అప్పుడెంత అందంగా ఉండేది? ఎందుకిలా అయిపోయింది?

నాకు నమస్కరిస్తోంటే కుర్చీ చూపించి, ''కూర్చోమ్మా'' అన్నాను. ఆమె కూర్చున్నాక, ''ఏమిటిలా అయిపోయావు?'' అడిగాను. బాధగా నవ్వింది.

కృష్ణారావుగారు చనిపోయిన మూడో సంవత్సరంలో



భారతి వాళ్ల అమ్మ కూడా చనిపోయింది.

''మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు నన్ను క్షమించండి. పదంటే పది నిమిషాలు మీతో మాట్లాడి వెళ్లి పోతాను'' నా ముఖంలోకి చూస్తూ ఆగింది.

''చెప్పమ్మా''.

''మా పెళ్లయిన మరుసటి సంవత్సరంలో నాకు బాబు పుట్టాడు. మామూలు కాన్పు. ఇప్పుడు వాడి వయసు తొమ్మిది సంవత్సరాలు. మానసికంగా ఎదగలేదు. నా దగ్గర తప్ప ఎవరి దగ్గర ఉండడు. తన పనులు ఏవీ తను చేసుకోలేడు. మాటలు నాకు తప్ప ఎవరికీ అర్థం కావు. రోజులో పదహారు గంటలకు పైగా నిద్రపోడు. అయిదు నిమిషాల పాటు నేను కనిపించకపోతే నానా యాగీ చేస్తాడు. వాడి నాన్న దగరకు కూడా వెళ్లడు. వాడు పుట్టకముందు సత్యంలో పని చేసే దాన్ని. నెలకు ఎనభయి వేల వరకు జీతం వచ్చేది. వాడిని ఏ వికలాంగుల కేంద్రంలో ఉంచినా ఉండకపోతోంటే నేను ఉద్యోగం మానేయక తప్పలేదు. ఇక్కడ చాలా మంది డాక్టర్లకు చూపించాం. బెంగళూరులో చూపించాం. ఢిల్లీ తీసుకు వెళ్లాం. ఏం లాభం లేక పోయింది. ఎన్ని మందులు వాడినా ఉపయోగం లేక పోయింది''.

''డాక్టర్లు ఏమన్నారు?''

''వాడు నా కడుపులో ఉన్నప్పుడు బిడ్డకు పడని మందులేవయినా వేసుకోవడం వలన బిడ్డ అలా పుట్టి ఉంటాడన్నారు. గైనకాలజిస్టు రాసిచ్చిన మందులు తప్ప నేను వేరేమీ పొరపాటునయినా వాడలేదు. పిల్లవాడంతే, బాగు అయ్యే ప్రశ్న లేదు. అయిదు సంవత్సరాల కిందట మరో బాబు పుట్టాడు. బిడ్డ కడుపులో పడిన దగ్గరనుండి ఎన్నో జాగ్రత్తలు తీసుకుని, ఎందుకయినా మంచిదని ఒకరు కాదు, ఇద్దరు కాదు అయిదారుగురు డాక్టర్లను సంప్రదించాం. రెండోది కూడా మామూలు కాన్పే. బిడ్డ ఆరోగ్యంగా పుట్టాడు. మొదటివాడితో పడిన కష్టమంతా మర్చి పోయాను. అయితే నా ఆనందం మూడు సంవత్సరాల కన్నా ఎక్కువ నిలవ లేదు. రెండవ వాడు కూడా మానసిక వికలాంగే. ఆ సంగతి మూడు సంవత్సరాల తర్వాత కాని బయటపడలేదు. రెండో వాడిని డాక్టర్లకు చూపించాం. వ్యాధి ఇదని ఎవరూ నిర్ధారించలేక పోయారు. ఒక్కో డాక్టరు ఒక్కో కారణం చెప్పారు. వెల్లూరు తీసుకెళ్లి చూపిస్తే జీన్స్ లోపం అయి ఉంటుందన్నారు.

''నా భర్త మంచి ఉద్యోగంలో ఉన్నాడు. వాళ్ల ఆఫీసుకు దగ్గరగా ప్రభుత్వ మానసిక వికలాంగుల కేంద్రం ఉంది. రెండో వాడు నన్ను వదిలి పెట్టి ఉండగలడు. కొత్తా పాత లేదు. అందరితో కలిసి పోతాడు – ముఖ్యంగా పిల్లలతో విచారకరమయిన విషయమేమిటంటే నన్నూ నా భర్తను గుర్తు పట్టలేడు. కొత్త వ్యక్తులను చూసినట్టుగా చూసేవాడు. అదే మాకు బాధగా ఉంటుండేది. మళ్లీ కేంద్రం లోని పిల్లలతో బాగా ఆడుకునే వాడు.

చదువుకునేప్పుడు, పెళ్లయిన తర్వాత జీవితాన్ని ఎంతో సుందరంగా ఊహించుకున్నాను. అయితే జరుగుతోంది పూర్తి వ్యతిరేకంగా ఉంది. అత్మహత్య విరమించుకున్నాను. నేను చనిపోతే నా పిల్లల్ని నా అంత ప్రేమగా ఎవరు చూసుకుంటారు? నా భర్త మంచివాడు. అన్ని విషయాల్లో నాకెంతో సహాయంగా ఉంటాడు. ఉదయం ఆఫీసుకు వెళ్తూ కారులో రెండో వాడిని తనతో తీసుకెళ్లి కేంద్రంలో వదిలిపెట్టి సాయంత్రం ఆఫీసు నుండి వస్తూ తీసుకు వచ్చేవాడు...

పది నెలల కిందట రెండో వాడిని కారులో నా భర్త తనతో తీసుకువెళ్లాడు. సరాసరి ఆఫీసు చేరుకుని పార్కింగ్‌లాట్‌లో కారు పార్కుచేసి వెనక సీట్లో వాడున్న సంగతి మర్చిపోయి ఆఫీసులోకి వెళ్లిపోయాడు. సాయంత్రం కారు బయటకు తీస్తున్నప్పుడు కాని వాడిని గమనించ లేదు. వాడు అప్పటికే చనిపోయి ఉన్నాడు...'' ఆగింది.

భారతి చెప్పడం మొదలు పెట్టినప్పుడే నిరంజన్ కేసు గుర్తు వచ్చింది. అతను భారతి భర్త అని ఇప్పుడు తెలిసింది. కోర్టులో కూడా ఆమెను ఎప్పుడూ చూడలేదు. చూసినా గుర్తు పట్టి ఉండే వాడిని కాదేమో. ప్రస్తుతం అతని కేసు నేనే చూస్తున్నాను. తన అశ్రద్ధ వలన కొడుకు చావుకు కారణమయ్యానని ఒప్పుకున్నాడు. ప్రాసిక్యూషన్ మటుకు అది అతని అశ్రద్ధ వలన జరిగింది కాదని, మానసిక వికలాంగుడయిన పిల్లవాడిని పెంచలేక ఆ విధంగా హత్యకు పాల్పడ్డాడని వాదించింది. వాదోపవాదాలు ముగిశాయి. నేను ఇవ్వాల్సిన తీర్పు మిగిలి ఉంది. వారం పది రోజుల్లో అదీ పూర్తి చేస్తాను.

''ఇంత వరకు ఎవరికీ తెలియని నిజం మీతో చెబుదామని వచ్చాను. ఈ సంగతి నా భర్తకు కూడా చెప్పలేదు. మా రెండో వాడంటే అతనికి ఎంతో ఇష్టం. ఈ పని నేను చేసి ఉండవలసింది కాదు. అంతకు ముందు ఎప్పుడూ లేనిది మా రెండో వాడు తోటి పిల్లల్ని ఒహటే కొడుతున్నాడని కేంద్రం నిర్వాహకురాలు నాకు ఫోను చేసి చెబితే వాడలా చేయకుండా కేంద్రానికి వెళ్లేప్పుడు వాడికి ఎప్పుడూ ఇచ్చే ముందు మోతాదు కొద్దిగా ఎక్కువగా ఇచ్చాను. దాంతో నిద్ర పట్టే అవకాశం ఉంది. వాడు కొద్దిగా హుషారుగా ఉంటే ఎదురుగా వచ్చే వాహనాలను చూసి కేకలు వేస్తూ చప్పట్లు కొట్టడం వాడికి అలవాటు. ఆ రోజు కారు వెనక సీట్లో మత్తుగా ఉండిపోవడంతో నా భర్త కారు ఎక్కలేదని అనుకున్నాడు... అసలు దోషి నా భర్త కాదు... నేను... నేనే...'' అంది భారతి.

ఆమెలో కన్నీళ్లు మిగిలి ఉన్నట్లు నాకు అనిపించలేదు.

*

చిరునామా:
బి.కె. ప్రసాద్ (టి.పి.కరుణాకర్)
డి. 304, అనురాధాసదన్,
అడిక్‌మెట్, హైదరాబాద్ - 44.
ఫోన్: 27070244, 9966080439

## కత్రినాకు సల్మాన్ అతి ఖరీదైన వాలంటైన్ గిఫ్ట్

ఇప్పటికే సల్మాన్, కత్రినా ప్రేమ వ్యవహారం గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. కత్రినా బొమ్మను సల్మాన్ పెయింట్ చేయడం, దానికి కత్రినా అద్భుతమైన ఫోజులివ్వడం, ఇవి కాకుండా అర్ధరాత్రి ఆటోరిక్షాలో సల్మాన్, కత్రినాల విహారాలు బాలీవుడ్‌లో మారుమోగుతున్న సంగతి తెలిసిందే! ఇవి కాకుండా వాలంటైన్ డే...అదే ప్రేమికుల రోజు నాడు తన ప్రియురాలికి కలకాలం గుర్తుండిపోయే గిఫ్ట్ ఇవ్వాలని సల్మాన్ అనుకున్నాడు. అది అతి ఖరీదైనది కూడా!! అంత ఖరీదైన గిఫ్ట్ ఏమిటని ఆలోచిస్తున్నారా? అందమైన ఫ్లాట్‌ను కత్రినాకు ఇచ్చే ప్రయత్నంలో పడ్డాడు సల్మాన్. ఆ ఫ్లాట్ ఇంటీరియర్ డెకరేషన్‌ను హృతిక్‌రోషన్ భార్యతో చేయించాలనే ఆలోచనలో కూడా ఉన్నాడు. విశాలమైన లివింగ్ రూమ్, రెండు బాల్కనీలతో అన్ని హంగులున్న ఆ ఇంటిని పెయింటింగ్‌లు, మంచి మంచి పోర్ట్రైస్‌తో నింపేయాలన్నది సల్మాన్ ఆలోచన. ఇదంతా కత్రినా చేతికి ఫ్లాట్ తాళం చెవులు ఇవ్వక ముందే జరగాలన్న తొందరలో ఉన్నాడు. ఎంత రొమాంటిక్ ఆలోచన! అని అందరూ ఆశ్చర్యపోతున్నారు.

